ఉత్తర కొరియాలో ఉన్న ప్రభుత్వం రష్యా ఏర్పాటుచేసి వెళ్ళినది కనకా, అది తల ఎత్తింది కనకా దాన్ని అమెరికా ఏ కర్రతో కొట్టినా ఎటువంటి రాజకీయ నీతికీ అంతర్జాతీయ నీతికీ భంగమంటూ ఉండటానికి అవకాశమే లేదని ప్రజలు సరిపెట్టుకోవలసి వస్తున్నది. అటువంటప్పుడు అమెరికా — ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు - కొరియామీద పడకపోతే రష్యామీదనే ఎందుకు పడరాదూ? దక్షిణ కొరియాలో యుద్ధం ఆపటానికి గాను అమెరికా ఉత్తర కొరియామీద బాంబులు వెయ్యటమూ, ఫార్మోజాను తన సాకలతో చైనా కమ్యూనిస్టులనుండి రక్షించటమూ సక్రమమైతే రష్యామీద దాడివెయ్యటం ఒకటే సక్రమం కాకపోయిందా?

అమెరికా కొరియాలో అడ్డు తగలకపోతే ఉత్తర దక్షిణ కొరియాల మధ్య జరిగే యుద్ధం ప్రపంచ యుద్ధానికి దారితీసి ఉండేదేనని ప్రపంచంలో ఎవరూ నమ్మరు. కాని ఈ కొరియా యుద్ధం అమెరికా యుద్ధోన్మాదాన్నీ, రాజకీయ ఆదర్శాలనూ నగ్నంగా బయటపెట్టింది. ఇప్పుడున్న ఐక్య రాజ్య సమితి ప్రత్యక్షంగా అమెరికా కాలికింది పీచుగా తయారై జనకుండవలసిన అంతర్జాతీయ ఖ్యాతిని పూర్తిగా పోగొట్టుకున్నది. అమెరికా ఈ పని చేసిన మీదట ఉత్తర కొరియా దక్షిణ కొరియా మీదికి నడవటం న్యాయమా, అన్యాయమా, క్రమమా, అక్రమమా అన్న ప్రశ్నకు తావు లేకుండా పోయింది. ఇదే అమెరికా సాధించిన మహత్తరమైన ఫలితం. అమెరికా వెనక వేసుకు వస్తున్న దక్షిణ కొరియా ప్రభుత్వం ఏ సిద్ధాంతం ప్రకారమూ రక్షించబడదగిన ప్రభుత్వం కాదు.

# ★ క్షణంలో సగం ★

"శారద"

అన్నట్టు నిద్రరాదు. చెప్పినట్టు రేడియో వినదు. మాట్లాడేవాళ్ళు కరువైపోతున్నారు. వాగేవాళ్ళు ఎక్కువై పోయారు. ధరలు పెరిగినకొద్దీ కుతంత్రాలు ఎక్కువై, అందరూ వ్యాపారంలో లక్షలార్జించి మంత్రులవుతున్నారు! అయితే యుద్ధాలకీ తంత్రాలకీ తేడా తెలీక మంత్రులు పంచాంగాలు చూస్తున్నారు.

కొరియా జాతకం బాగా లేదన్నాడు వేదాంతరావు. కాని అసలు మిత్రరాజ్యసమితి జాతకం గుణించి, శీఘ్రమేవ మరణప్రాప్తి వుంది అని స్వగతం వాదిస్తున్నాడు. బహుశః, ఉపగ్రహాల బాధకాక పెద్దగ్రహాలు నాలుగూ వక్రించటంవల్ల గాభరనని మద్రాసు పత్రిక ఒకటి ఊహించి కార్టూను ప్రకటించవచ్చు.

అయితే ఈ వర్షపుచినుకుల చిటపటల్లోంచి బైటికి చూస్తే అంతా చీకటిగా వుంది. కాని, దూరంగా, ఎవరిల్లో తగలడుతున్న కాంతి, ఫైర్ ఇంజన్ గణగణలతో కలసి కనిపిస్తోంది.

పక్కింటివారు ఏమాత్రం విసుగు లేకండా మహా ఓపికతో వింటూన్న వాళ్ల అమ్మాయి త్యాగరాయకృతి ఖూనీ, హార్మోనియం శ్రుతితో కలిసి అతిదారుణంగా ప్రపంచ శాంతి దేవత ఆలాపనగా వినిపిస్తోంది.

శాంతి కాముక రాజ్యాలన్నీ కలిసి యుద్ధంలో కొత్తపోకడల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాయి. మనిషి అవసరం లేకండా శతఘ్నులు ప్రయోగించే పద్ధతులు బహుశా ఇప్పుడే అమల్లోకి వచ్చేశాయి. శాంతిని ఇక నిరభ్యంతరంగా, అతిజాగ్రత్తగా పాలరాతి సమాధుల్లో కాపాడగలమని వేదాంతరావు ఐక్యరాజ్య సమితి అంతిమ సమావేశంలో ఉద్ఘోషించగలడన్న వార్త ఎంతవరకు నమ్మవచ్చునో తెలీలేదు.

తెలీలేదు. ఎలాగో? ఎనిమిదీ + నాలుగు = ఎన్నివందల ఏళ్ళకైనా పన్నెండే. దానికోసం

ఎవరెన్ని పరీక్షలు పెట్టినా, నాలుగూ నాలుగూ ఎనిమిదే. అవి పధ్నాలుగు ఎలాగా కావు. అట్లాగే వ్యాపారం + లాభం = అధికారమూ; అధికారం × పోటీ = యుద్ధమూ; అవుతున్నాయి ఇవే ఇలాగే వుంటాయి. వీటిల్లో మార్పు వస్తే రాదు. ఎనిమిదీ నాలుగూ పదమూడవుతాయా?

బైట గోల వినిపించింది. పరిగెత్తాను గోడలు, మేడలు దాటి. నా బెడ్‌రూం లైట్ చెప్తూనేవుంది గప్ గప్ మని. దానికి భయం. అక్కడ ... ఆ గుంపులో రూపాలు ... అంటే ఆకారాలు కన్పిస్తున్నాయేమో నని వెతికేను. అందరూ నల్లగా వున్నారు. ' ఉభయపక్షాల కంఠాలూ ఉద్ధృతమైన ఉచ్చైస్వరంలో వినిపిస్తున్నాయి.

'న్యాయం మాయింటికే వొచ్చింది' అన్నది ఉత్తరపక్షంలోని బొంగురు కంఠం.

'కాదు; న్యాయం అసలు మా యింటనే జన్మించింది' అన్నది ఇంకా దక్షిణ పక్కన ఫైటర్ విమానస్వరం.

కాసేపు మాటలకి బదులు తూటాలూ ఏడుపులకి బదులు గంధకం పొగా కనిపించాయి. ఈ గందరగోళంలో మధ్య మధ్య ఓ ఆర్త స్వరం వినిపిస్తోంది.

చీకట్లో ఆ స్వరం ఎవరిదో బాగా గుర్తించలేక పోయినా తెలుస్తోనే వుంది ఎవరో. వీళ్ళు దేనికోసం పోట్లాడుతున్నారో.

ఉదయించింది చీకటి. ముసుగు వాళ్ళూ, యుద్ధాలు అన్నీ పోయినాయి. స్పష్టంగా శ్మశాన భూమి కన్పించుతోంది. అంతటా ఎక్కడా పచ్చిక లేకండా భూమిలో గాజు కరిగి చదునుగా ఉదయపు ఎండకి ధగధగ మెరుస్తోంది. ఇక మళ్ళీ కొన్ని లక్షల సంవత్సరాలకి గాని సస్యశ్యామలం కాదు. ఈ గాజు తళతళల్లోంచి న్యాయం, ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం. ఆంధ్ర రాష్ట్రం, ఐక్యరాజ్యాల సభ, శాంతి సందేశం భద్రతాసమితి, వీటి అస్థిపంజరపు అవకాశాలు వెక్కిరిస్తో కనపడ్డాయి.

మానవాళి ఇక తెరిపిలేని, గాఢ నిద్రావస్థలో పడింది. మళ్ళీ ఇక తెల్లవారదు. యురేనియం, హైడ్రోజన్ అవసరం రాదు. వ్యాపారంలో పోటీలుండవ్. గ్రూప్ రాజకీయాలు లక్కర లేదు. నిజం నిలువు లోతున పాతిపెయ్యబడింది. గోడమీద పిల్లి సంపాదకీయాలు ప్రకటించే దేశీయ పత్రికలు శాశ్వత శాంతి సందేశంలో మునిగిపోవచ్చు.

కాలం నిట్టూర్చింది. నాగరికత తపన పడుతోంది చరిత్ర మళ్ళీ మొదటి కొచ్చింది.

మానవుడిక జన్మించడు. ఆకాశంలో నక్షత్రాలు గ్రహాల్ని ఏలుతున్నాయి. చంద్రుడు తుత్తునియలై భూమిలో కలిశాడు. ఇక ఎన్నటికీ అమావాస్యే.

నేను వెనక్కి మళ్ళాను. నాకు సంతోషంగా వుంది. తింటానికి ఏమీ లేకపోనే, ఆకలీవుండదు. రేషన్ బాధా లేదు. ఉత్తరప్రదేష్ వాళ్ళు బియ్యం ధర ఇక పెంచరు. కేంద్రంలో ఆహార మంత్రి అవసరం ఉండదు.

ఎంతశాంతి! మనుషు లుంటేనే ఎవరు పాలించాలి! ఎవరు పాలితులు - అని ప్రశ్నలు. అందరూ హతమారి పోతే; ఎవరూ వుండకపోతే; అంతా శాంతి; అంతా ప్రకృతిస్వామ్యమే.

భూభ్రమణం రెండు అక్షాంశ రేఖలు తప్పించి తిరుగుతుంది. సూర్యుడు ఇంకా దగ్గర పడతాడు. అంగారకుడిలో జీవంబయల్దేరుతుంది. అక్కడా అంగారకులు బయల్దేరుతారు. మళ్ళీ అక్కడా వ్యాపారం × పోటీ = యుద్ధాలు తయారు. ఎవరూ దిగులు పడక్కర్లేదు. ముసుగు వేసుకుని పదండి మూడో యుద్ధానికి. తటస్థంగా ఉంటూ బాంబులు తయారుచెయ్యండి. శాంతి కాముకులుగా వుంటూ అణువు పరిశోధన చెయ్యండి. బియ్యంనించి బాంబులూ తోటకూరనించి క్రూయిజర్ నౌకలూ తయారు కాక పోవు. ఒకర్నించి మరొకర్ని కాపాడ్డానికోసం, అందరూ కలిసి నశించండి. భయపడకండి. ఎప్పటికైనా చీకటినించే వెలుగు అని ఉపన్యాసాలు చెప్పండి నేనూ చూస్తూ వుంటాను, ఏంచెయ్యడానికీ తోచక.